# కంచె

**మ**ధ్యాన్నం రెండు గంటలు కావస్తూండగా, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, వెంకటాపురం స్టాప్‌లో బస్సుదిగి, తనతో పాటు బస్సు దిగిన ఒకరిద్దరిని "హైస్కూల్ దారెటువేపు?" అనడిగాడు.

"ఇలాగే నేరుగా వెళ్ళండి. ఊరి చివర ఉంది హైస్కూల్. మీరు సులభంగా కనుక్కుంటారు" అని ఒకరన్నారు.

మరొకాయన అటూ ఇటూ చూసి, పుస్తకాలు చేతబట్టుకొని వెళ్తున్న ఓ కుర్రాణ్ణి కేకేసి, ఆ కుర్రాడు దగ్గరకు రాగానే "వీరిని మీ స్కూల్‌కి తీసుకెళ్ళరా" అని పురమాయించాడు.

ఆ కుర్రాడు ఆయన వేపో అరక్షణం పరిశీలనగా చూసి "రండి సార్" అంటూ ముందుకు కదిలాడు. వాడి వెనకాలే ఆయనా నడిచారు.

ఆ సంవత్సరం ఏప్రిల్‌లో జరిగిన ఏడవతరగతి పరీక్షల్లో ఆ జిల్లాలో తొంభై శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. ముందెన్నడూ లేనంత గొప్ప శాతంలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారనీ, జిల్లా గణనీయంగా విద్యాభివృద్ధి సాధించిందనీ, విద్యాధికారులు ప్రకటనల పరంపరలు కురిపించేశారు. అయితే ఆ జిల్లాలో పది హైస్కూల్స్ మాత్రం పదిశాతం మించి ఫలితాలు సాధించలేకపోయాయి. ఇంకేముంది? ఆ హైస్కూళ్ళ మీద విద్యాధికారుల కన్ను పడింది. జిల్లా అంతటా విద్యాభివృద్ధి మూడు పువులూ, ముప్పయి కాయలుగా విలసిల్లుతూంటే ఈ హైస్కూళ్ళకేమొచ్చింది రోగం? పట్టుమని పదిశాతం కూడా సాధించలేక పోయారంటే ఆ స్కూళ్ళలోని ఉపాధ్యాయులేం చేస్తున్నట్టు? హెడ్మాస్టర్లేం పొడుస్తున్నట్టు? ఆ స్కూళ్ళను విజిట్ చేసి, విద్యాప్రమాణాలు ఎందుకింత అధ్వాన్నంగా పడిపోతున్నాయో పరిశీలించే బాధ్యత ఆ డివిజన్లకు సంబంధించిన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ల నెత్తి మీద పడింది.

ఆ పనిమీదే ఇప్పుడు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఆ ఊళ్ళో అడుగుపెట్టాడు. ఆయన ఈ జిల్లాకు ఈ మధ్యనే బదిలీ అయి వచ్చాడు. మొదటిసారిగా ఇప్పుడే ఈ స్కూల్ చూడటం.

ఊరి చివర ఉన్న స్కూల్ చేరుకొనేసరికి పది నిమిషాలు పట్టింది. స్కూల్ చుట్టూ కాంపౌండ్ లాంటి ముళ్ళకంచె. గేటుదాటి లోపలి కెళ్లగానే విశాలమైన గార్డెన్. అందమైన పూలమొక్కలూ, ఎత్తుగా ఎదిగిన యూకలిప్టస్ చెట్లూ, స్కూలంతా నిశ్శబ్దంగా ఉంది. ఫస్ట్ పీరియడ్ జరుగుతోంది.

ఓ కొత్త శాల్తీ స్కూల్లోకి వస్తూండడం 'స్టాఫ్ రూం'లో ఉన్న ఒకరిద్దరు టీచర్సు కిటికీ గుండాచూసి రెండు మూడు నిమిషాలు గుసగుసలు పోయి, నేరుగా హెడ్‌మాస్టర్ దగ్గరకు వెళ్ళి ఆ వస్తున్న శాల్తీని చూపించారు. ఆ హెడ్‌మాస్టర్ ఆ కొత్త శాల్తీని ఎగాదిగా చూసి "మన డి.యి.ఓ. గారండీ!" అని గొణిగి సరసరా బయటకు వచ్చి, ఆయన కెదురుగా అడుగులు వేసి రెండు చేతులూ జోడించి 'విష్' చేశాడు. వెంట వచ్చిన ఉపాధ్యాయులు కూడా ఆయనకు తమ వంతు విష్ చేసి ఆహ్వానించారు.

వాళ్ళ 'విష్'లను శిరఃకంపంతో మాత్రమే స్వీకరించి వాళ్ళ వెంటే ఆఫీస్‌రూమ్‌లోకి ప్రవేశించాడాయన. క్లాసుల్లో ఉన్న ఉపాధ్యాయులందరూ ఒక్క క్షణం తలలు బయటపెట్టి ఆయన్ను చూశారు.

ఆయన నేరుగా వెళ్ళి హెడ్‌మాస్టర్ సీట్లో కూచున్నాడు. తన ముఖంలో కృత్రిమమైన బింకమూ, దర్పమూ వెలిగించుకొన్నాడు. కూచుంటూనే సీరియస్‌గా చూస్తూ "అటెండెన్స్ రిజిస్టర్ ఇవ్వండి" అన్నాడు. ఒక ఉపాధ్యాయుడు వెంటనే రిజిస్టర్ తెచ్చి, ఆయన ముఖానికేసి కొడదామనుకొని, ఎదురుగా టేబుల్ మీదుంచాడు.

ఆయన దాన్ని చేతికి తీసుకొని పేజీలు తెరుస్తూ "స్టాఫంతా ఉన్నారా?" అనడిగాడు హెడ్మాస్టర్ను చూస్తూ....

''సైన్స్ టీచరూ, ఆర్ట్ మాస్టరూ తప్ప అందరూ ఉన్నారు సార్! వాళ్లిద్దరూ లీవ్ అప్లయ్ చేశారు" అన్నాడు హెడ్మాస్టర్ ఎదురుగా ఉన్న కుర్చీలో కూచుంటూ.

"స్టాఫ్‌ను పిలిపించండి" అన్నాడాయన రిజిస్టర్‌లో పేర్లు పరకాయిస్తూ.

హెడ్మాస్టర్ సైగ చేయగా అటెండర్ వెళ్ళి టీచర్స్ అందరినీ పిలుచుకొని వచ్చాడు. హెడ్మాస్టర్ ప్రతి టీచర్‌నూ ఆఫీసర్‌కు పరిచయం చేశాడు. వాళ్ళందరూ ఆయనకు విష్ చేసి అక్కడున్న బెంచీల మీద కూచున్నారు.

ఆ స్కూల్‌లో హెడ్మాస్టర్ కాక పదిమంది ఉపాధ్యాయులున్నారు. ముగ్గురు బి.ఇడీ.లూ, ముగ్గురు పండిట్లూ, ఇద్దరు ఎస్.జీ.లూ, ఒక డ్రిల్లు మాస్టారూ, ఒక ఆర్ట్ మాస్టారూ, వీళ్ళు గాక ఆఫీస్ సిబ్బంది మరో ముగ్గురూ.

క్లాసుల్లో నుంచి పిల్లల అరుపులు అప్పుడే తారస్థాయికి చేరుకుంటున్నాయి. డ్రిల్లు మాస్టర్ బెత్తం చేత పట్టుకొని పరిస్థితిని అదుపులో తేవటానికి భీకరంగా బయటకు వెళ్ళాడు.

"ఈ సంవత్సరం సెవెన్త్ రిజిల్ట్స్ ఎంత వచ్చిందండీ?" తెలిసీ హుందా ఒలకబోస్తూ అడిగాడు ఆఫీసర్.

"ఎనిమిది శాతం వచ్చింది సార్?" అన్నాడు హెడ్మాస్టర్.

"పరీక్ష ఎంత మంది కూచొన్నారు?"

"నలభై ఎనిమిది మంది కూచొన్నారు. నలుగురు మాత్రం పాసయ్యారు సార్!"

"వెరీ పూర్ రిజల్ట్స్... ఈజ్ ఇట్ నాట్ షేమ్ ఫర్ యూ?" ముఖం సాధ్యమైనంత కోపంగా మార్చుకొన్నాడాయన.

ఉపాధ్యాయులందరూ ఆయన వేపు నిశ్శబ్దంగా చూస్తున్నారు. ఈ ఆఫీసర్ల ధోరణి వాళ్ళకు కొత్త కాదు. పిడుగులు పడినా చలించని గాంభీర్యం వాళ్ళది.

వీళ్లకు బదులు చెప్పటం వల్ల కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని తెలిసే హెడ్మాస్టర్ మౌనంగా ఉండిపోయాడు.

బయట డ్రిల్లు మాస్టార్‌గారి భీకర గర్జనలు వినిపిస్తున్నాయి. విద్యార్థులందరూ క్రూరమృగానికి జడిసిన కుందేళ్ళలా నిశ్శబ్దమైపోయారు.

అటెండర్ ఒక కప్పు టీని ఆఫీసర్ ముందుంచాడు. ఆయన దానివేపు నిర్లక్ష్యంగా చూసి పక్కకు జరిపాడు.

ఏమిటండీ, అందరూ అలా నిమ్మకు నీరెత్తినట్లున్నారు? ఈ జిల్లా మొత్తం మీద ఇంత పూర్ రిజల్ట్స్ మరే స్కూల్లోనే రాలేదు. ఏం చేస్తున్నారు మీరంతా?"

"మీ ఉపన్యాసం వింటున్నాం" మనసులో ఒక ఉపాధ్యాయుడు గొణుక్కున్నాడు.

"మా ప్రయత్నంలో లోపం లేదు సార్. పిల్లలకు స్థాయి లేక పోవటమూ..." అంటూ ఒక ఉపాధ్యాయుడు మెల్లగా గొంతు విప్పాడు.

"రూరల్ ఏరియాల్లో పిల్లలకు చదువుమీదున్న శ్రద్ధ అంతంత మాత్రమే సార్" అని మరో ఉపాధ్యాయుడు వంత గలిపాడు.

"పిల్లలు స్కూల్‌కు వస్తారు. ఇంటికి వెళ్తారు. చదువంతా స్కూల్లోనే రావాలనుకుంటారు పిల్లల తల్లిదండ్రులు – ఇంట్లో ఒక్క నిమిషం కూడా పిల్లలు పుస్తకాలు తాకరు".

"నాన్ డిటెన్షన్ పద్ధతి కూడా ఒక ముఖ్యమైన కారణం సార్. పిల్లలు ఏమీ చదవకుండా ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి దాకా వస్తున్నారు."

వాళ్ళందరి మాటలూ వింటూ తల నెమ్మదిగా అటూ ఇటూ ఆడించి "బావుందండీ మీరు చెప్పేది? దేశంలో మీ ఒక్క స్కూలే రూరల్ ఏరియాలో ఉన్నట్టు? అయితే ఫలితాలు బాగా వచ్చిన పాఠశాలలు రూరల్ ఏరియాలో లేవనే మీ అభిప్రాయమా?" అన్నాడు.

"అలా ఎందుకంటాం సార్! చాలా స్కూళ్ళలో మంచి ఫలితాలే వచ్చాయి" అన్నాడు హెడ్మాస్టర్ నెమ్మదిగా.

"ఎలా వచ్చాయంటారు మరి?"

"దాని కారణాలు దానికి ఉంటాయి సార్– మీకు మాత్రం తెలియందేముంది?" అన్నాడు ఒక ఎస్.జి.

"చాలా స్కూళ్ళల్లో మూక ఉమ్మడి కాపీలు జరుగుతున్నాయి సార్. ఇది ఓపెన్ సీక్రెట్. జిల్లా అంతా న్యాయంగా. నిజాయితీగా పరీక్షలు నిర్వహిస్తే పదిశాతం మించి పాస్ కారని నేను కచ్చితంగా నిరూపించగలను". హెడ్మాస్టర్ గొంతులో కొంత ఆవేశం ధ్వనించింది.

"స్పాట్ వాల్యుయేషన్‌లో ఎన్ని అవకతవకలు జరుగుతున్నాయో మీకు తెలియంది కాదు. పేపర్లు దిద్దేవాళ్ళు లోపల రెండు వందల మంది ఉంటే, బయట రెండువేల మంది తమ పిల్లల నంబర్లు పట్టుకొని తిరుగుతూ ఉంటారు. ఇక రిజల్ట్స్ ఎందుకు రావు సార్?" లెక్కల టీచర్ ఆక్రోశంతో చేతులు ఊపేశాడు.

"రిజల్ట్స్ బాగా వచ్చిన స్కూళ్ళన్నీ ఈ రకమేనంటారా మీరు?" ఆఫీసర్ కంఠంలో కోపం స్పష్టంగా కనిపించింది.

'కచ్చితంగా ఇంతే సార్! ఒకటి, రెండు శాతం స్కూళ్ళకు మాత్రం మినహాయింపు ఉండవచ్చు" అన్నాడు హెడ్మాస్టర్.

"అయితే మీ స్కూల్ రిజల్ట్స్ ఇలా పడిపోవడానికి మీరు చెప్పే కారణం?"

"ఏముంది సార్! మేమూ చాలాస్ట్రిక్ట్‌గా పరీక్షలు నిర్వహిస్తాం. బాగా రాసిన విద్యార్థే బయట పడతాడు."

"ఇంతకు మించి ఫలితాలు సాధించటం మీకు సాధ్యం కాదంటారు!"

"అలా ఎందుకంటాం సార్? న్యాయమైన పద్ధతుల్లో తప్పక ప్రయత్నిస్తాం" హెడ్మాస్టర్ గొంతు నిశ్చయ స్వరంతో ధ్వనించింది.

ఆఫీసర్ ఆయన ముఖంలోకి సూటిగా చూశాడు. రెండు కనుబొమలనూ సాధ్యమైనంత దగ్గరగా చేరుస్తూ. "ఆ పద్ధతుల్లో ఫలితాలు రావని ఒకవైపు మీరు చెబుతూనే, మళ్ళీ అవే పద్ధతులంటే ఎలాగండీ?" అన్నాడు తీక్షణంగా.

"అంటే మీ ఉద్దేశం?"

"మాకు మీ న్యాయాన్యాయాలూ, పద్ధతులూ చెప్పకండి. మాకు కావాల్సింది ఫలితాలు! మిగతా స్కూళ్ళన్నీ సాధించే పద్ధతుల్లోనే మీరు మాత్రం ఎందుకు ఫలితాలు సాధించకూడదు? మీ చేతుల్లో ఉండే వ్యవహారమేగా ఇది! మీ న్యాయదీక్షకు మీ నెత్తిన కిరీటం మొలుస్తుందనుకున్నారా?"

ఇంకా ఏదో చెప్పబోతూన్న ఆ ఆఫీసర్ వేపు నోళ్ళు తెరిచి చూస్తుండిపోయారు హెడ్మాస్టరూ, ఉపాధ్యాయులూ.

స్కూలంతా నిశ్శబ్దంతో వణికిపోతోంది.

❖ **ఆంధ్రప్రభ, 3-2-1988**